నర్తకి

ఒక్క క్షణం క్రితం అతినిశ్శబ్దంగా గాలి కదలటం లేదన్నట్లున్న ఆహాలు ఉన్నట్టుండి హోరుహోరున మోతలెత్తింది. నృత్య ప్రదర్శనం కరతాళధ్వనులతో ముగిసింది. రతి మెడనిండా దండలు నిండిపోతున్నాయి. అభినందనల వర్షం కురుస్తోంది. అద్భుతం, అమోఘం, ఆశ్చర్యం, ఓహో, ఆహా మొదలైన మాటలు మామూళ్ళదిగా దొర్లుతున్నాయి. రతికి మెళ్లో గులాబీలు గుచ్చుకుంటున్నాయి. గాలిచొరబలేని అభిమానుల గుంపుమధ్య, ఆనందం పట్టలేని రతి. పూలదండల బరువుతో భారంగావంగి గురువుగారికి పాదాభివందనం చేసింది. గురూజీ కళ్లలో ఆనందాశ్రువులు కదలాడగా, రతిని పైకి లేవదీసి శిరస్సు చుంబించాడు. గుంపులో ఇద్దరుముగ్గురు కుర్రకారు కొరకొర చూశారు.

జనం సద్దుమణిగారు. బయట సిద్ధంగా ఉన్న కారులో గురూజీ వెళ్ళికూర్చున్నారు. గజ్జెలు విప్పుకుని తనూ వెళ్ళాలి. రతి వంగి గజ్జెలు విప్పుకుంటోంది.

'విలయం పుట్టించగల మీ కోమలమైన పాదాలమీద ఈ పువ్వులు పెట్టిపోదామని వచ్చాను.'

వంచిన తల ఎత్తిచూసింది. ఎదురుగా మొంగొంతు—చిరునవ్వు కళ్లు—చురుక్కుమన్న చూపు.

'మీ...ఈ...మీ...మీ...'

బయట కారుహారన్ మోగింది.

'ఆ...వ...స్తున్నా'

ఒకకాలి గజ్జెలపట్టెడ గబగబా విప్పుకుని, తొందరపాటుగా రెండడుగులేసి 'అబ్బా' అని కూర్చుండిపోయింది. గజ్జెలపట్టెడలోని గజ్జె ఒకటితెగి పాదానికి గుచ్చుకుంది.

'మరి నా నివేదన తీసుకోకుండా పోతే ఎలా!' అతడు తెగినగజ్జె చేతి కందించాడు. పువ్వులు పాదంమీద ఉంచాడు. రతి చలించి పోయింది. అంతరాంతరాలలో తంత్రులు తీవ్రమైన ప్రకంపనాన్ని పొందాయి.

'మీ....ఈ....మీ....మీ...' వణుకుతున్న పెదవులు—పెగలని మాటలు.

'రాజు...'

బయటకారు హారన్ వస్తాయిలా మోగింది.

'వ...వచ్చే' పువ్వులు, తెగినగజ్జె చేత్తో పట్టుకుని తొట్రుపాటుగా గేటు వైపు పరుగెత్తింది.

'బయటికి దయచెయ్యండి. మూసేస్తాం' అన్న చౌకీదారు పలకరింపుతో తేరుకున్నాడు రాజు.

రతి నృత్యంగురించి మర్నాడు పేపర్లో పడింది. రతితండ్రి పద్మనాభరావు పొంగిపోయాడు. ఆయనకు రతిలో ఏదో అతిలోకమైన శక్తిఉందని మొట్టమొదట్నించీ నమ్మకం. ఆయన భార్యపోయినప్పట్నించీ రతిని గారాబంగా పెంచాడు. మద్రాసులో ఉండగా తంజావూరునాట్యం చెప్పించాడు. అంతా బాగుందన్నారు. ఆనందమైంది. అమ్మాయిని అంతా మెచ్చుకుంటుంటే ఆయనకు జన్మధన్యమైనట్లుండేది. 'భలానా వారి అమ్మాయి...ఓహో...' అని అంతా పొగడాలి. జేజేలు పలకాలి. అదే తనజీవిత లక్ష్యం, అనుకున్నాడు.

కాని రతి మనస్సు నృత్యంపై పు ఆసక్తమై ఉందో లేదో తెలిసికోవటానికి ఆయ నెప్పుడూ ప్రయత్నించలేదు. తెల్లటి కాన్వాసుమీద తనకు చేతికందిన రంగు

శంకరమంచి సత్యం

పూసేశాడు. అది అతుక్కుపోయింది. పద్మనాభరావుకు హైదరాబాద్ బదిలీ అవటంతో నృత్యానికి ఆటంకం ఏర్పడింది. రతి బి. ఏ.లో చేరింది. చదువు క్రమంగా సాగుతున్నా, పద్మనాభరావుకు రతి విద్యాఖాళీగా ఉన్నట్లు, కాలమంతా వృథా గాపోతున్నట్లు అనిపించేది. వెనకటి నాట్యపాఠాలు మర్చిపోకుండా సాధనచేస్తూ ఉండమని రోజుకు నాలుగుసార్లు హెచ్చరించేవాడు. రతికి నృత్యంమీద ప్రత్యేకమైన అభిమానమేమీ ఉన్నట్లు కనిపించదు. అదొక వ్యాపకం. చదువు చూసుకుంటూ, మధ్యమధ్య నాట్యం సాధన చేస్తుంటే విశ్రాంతిగా ఉంటుంది. మనసుకు సుఖంగా ఒంటికి ఆరోగ్యంగా ఉండేది. అప్పుడప్పుడు తన స్నేహితురాళ్లు పొగుడుతూఉంటే, కళ్లు గర్వంగా మిలమిలలాడేవి. తల ఠీవిగా పైకెత్తి ముందుకు వేసుకొన్న వాల్జడను అలవోకగా వెనక్కు విసిరికొట్టేది. ఆ విసురుకు జడగంటలు గునగునలాడేవి.

కొంతకాలానికి పద్మనాభరావుకు గురూజీ తటసపడాడు. గురూజీ కూచిపూడి నాట్యంలో అందెవేసిన చెయ్యి. కాని ఆయన కూచిపూడి మనిషి కాదు. ఇంగ్లీషు చదువుకున్నవాడు. ఈనాటి సమాజం అభి

వచులు తెలిసినవాడు. మిగతా భారతీయ నాట్య సంప్రదాయాలు కూడా కొద్దికొద్దిగా గ్రహించినవాడు. గీతానికి స్వయంగా నాట్య రచన చేయాలనే ఆసక్తి కలవాడు. మర్నాటి నుంచీ రతి గురూజీవద్ద నాట్యాభ్యాసం ప్రారంభించింది.

రతి ఎదిగివస్తున్న గున్నమామిడి కొట్లాగే ఉంది. ఆమెలో తొంగిచూస్తున్న యౌవనం గీతానికి, గీతావలంబనమైన నాట్యానికి నిండుతనం కూరుస్తోంది. ఆమె నవ్వులో పూర్వపు పసితనపుఛాయ మాయమయి గుండెలు చివ్వటం నేర్చుకుంది. నడకలో తప్పటడుగులుపోయి సౌందర్యవిన్యాసం సమకూరింది. పాలబుగ్గల చెక్కిళ్ళు ఎరుపుదనం నించుకుని రాగరంజితాలవుతున్నాయి. చూపులు తూపులైనాయి. అధరం ఇప్పుడందరికీ అందరానిదయింది. తొలిసారిగా సిగ్గుపడి నేల చూడటం మొదలెట్టినరతి వసంతసేన అయింది.

రతి నృత్యప్రదర్శనానికి అంతా సిద్ధమైంది. మంత్రులకు, ఆఫీసర్లకు, న్యాయవాదులకు, వర్తకులకు, కళాకారులకు, అందరికీ ఆహ్వానాలు వెళ్ళాయి. నగరంలో దాదాపు అన్ని సాంస్కృతిక కార్యకలాపాలతో సంబంధం పెట్టుకున్న ఒక ప్రముఖ అధికారిని ఆశీర్వదించవలసింగా అభ్యర్థించారు. ఆయన ఐదునిమిషాలు ఉండటానికి వెంటనే అంగీకరించాడు. దేశంలోని ప్రముఖులకు సందేశాలు పంపమని కోరుతూ పదిరోజులు ముందుగా జాబులు వ్రాశారు. వారు యథాశక్తి దీవిస్తూ ప్రదర్శనానికి రెండురోజులు ముందుగా జవాబులు వ్రాశారు. అవి చదవటానికి మరొక ప్రముఖుణ్ణి నియమించారు. పెద్దపెట్టున ఏర్పాట్లన్నీ జరిగాయి. హాలు ద్వారాలకు మామిడి తోరణాలు, దోవంట కొబ్బరి మట్టలు కట్టించారు. హాలు బయట వందమంది పోలీసుల బందోబస్తు పెట్టించారు. ప్రదర్శనం దిగ్విజయంగా ముగిసింది. మంత్రులు, ఆఫీసర్లు, వర్తకులు, న్యాయవాదులు, కళాకారుల్లో కొందరు పద్మనాభరావుని, గురూజీని పదే పదే అభినందించి ఆకాశానికెత్తేశారు.

* * *

రతికి ఆనాటిరాత్రి నిద్ర పట్టటంలేదు. ప్రదర్శన దిగ్విజయంగా పూర్తవటం, జనమంతా తనచుట్టూ మూగటం అవన్నీ విశేషంగా కన్పించలేదు. రాజా తనపాదం తాకినప్పుడు తను వణికిపోయింది. తనలో రక్తం ఉరకలు పెట్టి పారింది. పురుషుడి స్పర్శలో ఇంత శక్తి ఉండేనా అనుకుంది. కాని

నర్తకి

గురూజీ తనకు భంగిమ కుదరనప్పుడు చాలా సార్లు తాకి చెప్పేవాడు. చేతులు విరిచేవాడు కాని తానెప్పుడూ కదిలిపోలేదు. తనకే భావనా కలగలేదు. తెగిన గజ్జె చేతికివ్వటం, తన పాదంమీద పువ్వు లుంచటం తలుచుకుని, సిగ్గుపడిపోయి, చేతులతో పాదాలు కప్పేసి తలవాల్చేసుకుంది.

టేబుల్ మీద తెగిన గజ్జె ఘల్లుఘల్లున మోగింది. రతిలేచి ఓరమోముచేసి చూసింది. పక్కనే రాజుఇచ్చిన రెండు గులాబీలు రెపరెపలాడి కవ్వించి పిలిచాయి. లేచివెళ్లి గజ్జెను, గులాబీలను పరుపుమీదికి తెచ్చుకుంది. గజ్జెను మళ్ళీ మళ్లీ మోగించింది. అర్ధరాత్రి నిశ్శబ్దంలో ఆ ఘల్లుమన్న నాదం, గుండె తీగల్ని పట్టి బలంగా ఊపుతోంది. అది దేవ గానంలా ఉంది. ఆ గులాబీలను తదేకంగా చూస్తుంటే నందనవనంలా ఉంది. గట్టిగా వక్షానికి హత్తుకుంది. తెల్లవారినా ఒళ్ళు తెలియదు రతికి.

ఇప్పుడు నాట్యం అభ్యాసం చేస్తుంటే రతికి కొత్తఅనుభవం కలుగుతోంది. తన సౌందర్యం తనకు స్పష్టంగా దర్శనమిస్తున్నట్లుంది; ఒకటి రెండుసార్లు గురూజీ రతినితాకి భంగిమ సరిచేయపోతే, దూరంగా జరిగి తనే భంగిమ సరిగ్గాపట్టింది. గీతంలోని సాహిత్యం ఇప్పుడు సరిగ్గా బోధపడుతోంది. సాహిత్యానుగుణంగా అభినయం పట్టుతున్నప్పుడు తన్మయపడుతోంది. రాజు గీతంలో సాక్షాత్కరిస్తున్నాడు. తను వేస్తున్న ప్రతిఅడుగు అతని సామీప్యం కోసం వేస్తున్నట్లుంది. తన హస్తవిన్యాసం అతన్నే పిలుస్తోంది. తనకళ్లు అతన్నే చూస్తున్నాయి. తన మనసు అతే లగ్నమైంది.

'మురులూ గొన్నానే! చెలియ! మరువా లేకున్నానే' అన్న జావళీ అభినయిస్తూ రతి విరహంపొందింది. 'రాజేమో ప్రియుడు, నీల మేఘశ్యాముడు' అని వియోగంలో కంటనీరు పెట్టింది. 'ఏడే చోరుడే! నందకిశోరుడే' అని నేరంమోపుతూకృష్ణుడిబుగ్గలునొక్కబోయి, తన బుగ్గలు నొక్కుకుని, పమిట చాటుచేసుకొని నవ్వుకుంది. 'కొసరి కొసరి నాతో సరసములాడకు' అన్న పదం పడ్తూ, మరీ మరీ కొసరికొసరి సంతోష సంకోచాలను అభినయించింది. 'విడు విడు నా కొంగు' అంటూ సిగ్గు ముంచెత్తగా కుప్పకూలిపోయింది. మీరాభజన్ అభినయిస్తున్నప్పుడు అతడు ప్రభువైనాడు. జయదేవుని అష్టపదిలో తను రాధికైతే అతడు మురళీమోహనుడు. తను ఎంకి–అతడు నాయుడుబావ, బంగారు మావ. గీతం నృత్యమైంది. నృత్యం తానైంది. తనలోని ప్రత్యణువూ అతనికొరకు సిద్ధపరచబడిన పవిత్ర నైవేద్యమైంది.

పద్మనాభరావు కూతురుమీద చాలాఆశలు పెట్టుకున్నాడు. రతి ఆంధ్రదేశంలో ప్రఖ్యాతనర్తకి కావాలి. తర్వాత మిగతా రాష్ట్రాల్లో పర్యటించాలి. కేంద్రప్రభుత్వ మన్ననలు పొందాలి. ఆ తర్వాత విదేశాల్లో ప్రదర్శించాలి. ప్రపంచ మంతా తన కూతుర్ని మెచ్చుకోవాలి. జనమంతా 'నాట్యానికి మారుపేరు రతి' అని వేనోళ్ళ పొగడాలి. ఆమె జీవితం కళకు అంకితంకావాలి – అని.

ఒకరోజున పద్మనాభరావు అక్కగారు పనిగట్టుకుని హైదరాబాదు వచ్చింది. కాఫీ ఫలహారా లయ్యాక 'విన్నావుటే అమ్మాయి పేరు ఎట్లా మోగిపోతోందో' అన్నాడు పద్మనాభరావు.

'అఁ విన్నాముగాని, ఈడొచ్చిన పిల్లకు ఇంకా ఆ ఆటలూ, డాన్సులూ ఏమిటి? పెళ్ళి చెయ్యవా ఏంరా?'

'హుఁష్! పెద్దగా అనకు. అమ్మాయి వింటుంది' అని వారించాడు పద్మనాభరావు.

'ఏం వింటే! ఆదేం ఆడపిల్ల కాదా?'

'నీకు తెలియదమ్మ! ఇప్పుడు పెళ్ళిసంగతెత్తితే దాని జీవితం పాడైపోతుంది!'

'మరీ సోద్యం! పెళ్ళిచేసికొంటే బతుకు పాడవుతుందా?'

'నువ్వు మరీ పాతకాలపుదానివి.'

'మరి ఈ కొత్తకాలంవాళ్లెవరూ పెళ్లిళ్ల చేసికోవడంలేదుట్రా?'

'అదిగాదే. నీ కర్థంకావటంలేదు. రతికి పెళ్ళిచెయ్యగూడదు. రతిలో నీకు తెలియని మహావిశేషం ఉంది. దాని దృష్టి నాట్యం మీదతప్ప, మరి దేనిమీదికీ పోకూడదు. పెళ్ళిచేసికొంటే నాట్యం దెబ్బతింటుంది. అది కళకు అంకితమైపోవాలి.'

'ఏవిట్రా! ఇందాకణ్ణించి చూస్తున్నాను. కళంటావు. అంకితమంటావు. ఇంతకీ ఆడదానికి పెళ్ళి వద్దంటావుట్రా!'

'అబ్బబ్బ. రతి అందరి ఆడవాళ్ళలా కాదే. అది సంసారంలో పడితే కళకు ద్రోహంచేసినట్లవుతుంది.'

'ఒరేయ్! ఇంక నీ వాగుడుఆపరా. పెళ్లి చేసికొంటే ద్రోహం చేసినట్లా. వయసొచ్చినా గంతులేస్తుంటే బావుంటుందా!'

'నీకు చెప్పలేక ఛస్తున్నానే, ఇంక ఆవిషయం వదిలెయ్.'

'అబ్బాయ్! నేనొక్క మాట చెప్తా విను. ఆడదాన్ని అట్లా ఉంచటం మన ఇంటా వంటా లేదు. ఏ వయస్సు ముచ్చట ఆ వయస్సుది. ఆ వయస్సులో ఆకల్యాణం ముచ్చట తీరకపోతే ముద్దుగా ఉండవలసిన అమ్మాయి మొద్దై కూర్చుంటుంది. తర్వాత నీ ఇష్టం.'

తలుపుచాటునుంచి వింటున్న రతికి ఈ వాదన నచ్చటంలేదు. నాన్న వచ్చి 'అమ్మా! నీకు పెళ్లి చేద్దామనుకుంటున్నాను' అంటే ఎప్పుడు ఊఁకొడ్దామా అని ఎదురుచూస్తున్న రతికి పద్మనాభరావు మాటలు అపశ్రుతులుగా తోచాయి.

"మనదేవూరు బ్రదర్?"

"నీది ఈవూరు. నాదింకో వూరు."

* * *

"సార్ ఈ సీట్లో ఎవరన్నా ఉన్నారాండీ?"

"కళ్ళు కనపట్టంలే?"

—రాజాలపూడి నరసింహారావు,
నర్సాపురం.

ఆంధ్రాభ్యుదయోత్సవాల్లో రతినృత్యం ఏర్పాటైంది. రతి ఈమారు ప్రదర్శన పేరు చెప్తేనే పులకరించిపోతోంది. రెండింతలుగా అలంకరించుకుంది. అద్దం ముందు కూర్చుని తన్ను తను చూసికొంది. అద్దంలో అప్సరస పిలిచింది. తన్నుతను కొంటెగా వెక్కిరించుకుంది. తన్నుతను చూపుడు వేలుతో బెదిరించుకుంది. నాట్య శిక్షణలో ఏపుగా పెరిగిన తన అవయవాలను చూసికొని మురిసిపోయింది. తన్నుతను ముద్దు పెట్టుకుని సిగ్గుతో చరాలున ముఖం తిప్పేసుకుంది.

నృత్యం ఆరంభమైంది. రతి కళ్లు రాజు కోసమే వెతుకుతున్నాయి. ప్రేక్షకుల్లో ఎక్కడా కన్పించటం లేదు. విరహం, వియోగం, అధికమైనాయి. ఎలుగెత్తి పిలిచింది. నీరసంతో ముఖం వాడిపోయింది. అతడికోసం నిరీక్షణలో అభిసారికై ఆత్మానుగతమైన భావాన్ని అభినయించింది. జనం దిగ్భ్రమ పొందారు. కార్యక్రమంలో తర్వాతభాగం నారాయణతీర్థ తరంగం, ఆ తర్వాత దశావతారాలు. రతి ముఖంలో విషాదచ్ఛాయలు వీడిపోలేదు. ఆమె కళ్లు ఇంకా వెతుకుతూనే ఉన్నాయి. ఎన్నడూ లేంది, తరంగం సగంఅయ్యేప్పటికి తిర అలిసిపోయింది. దశావతారఘట్టంలో ముఖంలో క్రౌర్యం రాలేదు. చకచక పడవలసిన అడుగులు మందంగా పడుతున్నాయి. ఆ తర్వాత నాట్యం రక్తికట్టలేదు.

ప్రదర్శన అయింతర్వాత మామూలుగా అంతా దండలువేశారు. ప్రశంసించారు. అతడు రాలేదు. అంతా వెళ్లిపోయారు. అతడు రాలేదు. బయట కారు హారన్ మోగుతోంది. తను సమాధానం చెప్పదు. విప్పిన కాలగజ్జెలు తిరిగి కట్టుకుంది. మళ్లీ

(53 వ పేజీ చూడండి)

నర్తకి

(10-వ పేజీ తరువాయి)

విప్పింది. మళ్ళీ కట్టుకుంది. గజ్జె తెగలేదు. అతడు రాలేదు. బయట కారు హారన్ చెయ్యాంకూసినట్లు ఆగకుండా అరుస్తోంది. రతి లేచి వెళ్ళిపోయింది.

ఇంటికి వెళ్ళాక పద్మనాభరావు 'ఏం తల్లీ! అట్లా ఉన్నావ్?' అనడిగాడు.

'అమ్మాయికి సగంలో అలుపు రాకుండా బాదంపాలు ఇంకొ ఎక్కువ ఇప్పించాలండీ' అన్నాడు గురూజీ.

'ఆ! అందులో రెండు విషంచుక్కలు కలపండి సరిపోతుంది' అనుకుంది రతి.

'ఏవిటమ్మా! ఒంట్లో బాగులేదా?' తిరిగి అడిగాడు పద్మనాభరావు.

'అవున్నాన్నా' అంటూ లోపలికి వెళ్ళింది రతి.

'కొంచెం విశ్రాంతి అవసరం' అన్నాడు గురూజీ.

ఆతర్వాత గురూజీ, పద్మనాభరావు భారతదేశంలో మిగతా రాష్ట్రాలలో రతి నృత్యప్రదర్శనం గురించి చర్చించటం మొదలెట్టారు. ఏరాష్ట్రం నుంచి ఏ రాష్ట్రానికి పోవలసింది అక్కడ వసతులు హంగులు మొదలైన వివరాలు మాట్లాడుకున్నారు. నృత్యానికి సంబంధించిన పుస్తులు వగైరాలు కొనటానికి, ప్రయాణపు ఏర్పాట్లు పూర్తి చేసుకోవటానికి రేపే బయల్దేరి మద్రాసు వెళ్ళాలని నిశ్చయించుకున్నారు.

ఇల్లంతా బావురుమంటోంది. రతికి ఏమీ తోచటం లేదు. గురూజీ, పద్మనాభరావు రెండురోజులక్రితమే మద్రాసు వెళ్ళారు. రతికి 'ఎందుకిదంతా' అనిపిస్తోంది. పనిమనిషి పళ్ళరసం పట్టుకొస్తే వద్దని తిప్పి పంపించింది. ఎదురుగా టేబుల్ మీద తెగిన గజ్జె, పక్కనే వాడిన గులాబీలు బిక్కు బిక్కుమంటున్నాయి. సాయంత్రపు ఈదురుగాలికి కిటికీ తలుపులు దబదబ కొట్టుకున్నాయి. తలుపులు వేసివద్దామని లేచి వెళ్ళింది. కిటికీలోంచి వీధిలోకి చూస్తే — అతనే...అతనే...గేటు దాటి లోపలికి వస్తున్నాడు. ముప్పిరిగొన్న సంతోషం ఊపిరాడనిచ్చిందికాదు. కాళ్ళు తడబడగా రతి ద్వారం వైపుకి పరుగెత్తింది.

'రం...డి' మాట సగం గొంతులోనే మిగిలిపోయింది. రాజు లోపలికి వచ్చాడు. 'ఆనాడు మీ ప్రదర్శనానికి రాలేకపోయాను' అంటూ.

కుర్చీ చూపించి కూర్చోమంది. పనిమనిషిని పిలిచి పళ్ళరసం తెప్పించింది.

'మరి మీకో—' అన్నాడు రాజు.

తనూ తెప్పించుకు తాగింది.

రతి ఏమీ మాట్లాడలేకపోతోంది. సంబరపుటలలు ఎడాపెడా కొట్టి ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. తలవంచు కూర్చుంది.

'ఆరోజు నాట్యం బాగా జరిగిందా?' అడిగాడు రాజు. తల అటూ ఇటూ ఊపింది. అవుననో కాదనో అర్థం కాలేదు. మూగ నిమిషాలు రెండు గడిచాయి. మూడో నిమిషంలో ఇలా పలికింది 'అలా తోటలోకి వెళ్దాం—' రతిని అనుసరించాడు రాజు.

పచ్చగడ్డిమీద పక్కపక్కగా నడుస్తున్నారిద్దరూ. రతి చెప్పులతోటే నడుస్తోంది.

'అందమైన మీ పాదాలస్పర్శకు ఈ పచ్చగడ్డి నోచుకోలేదా?' అన్నాడు రాజు.

రతికి పూర్వవృత్తాంతం జ్ఞాపకం వచ్చింది. గిరుక్కున వెనక్కుతిరిగి బొటనవేలు కొరుకుతూ నవ్వుకుంది. చెప్పులు విసురుగా విడిచేసి రాజువైపు తిరిగి చూసింది. అతనేదో నవ్వుతూ అన్నాడు. రతికి ఏమీ వినిపించటం లేదు. అతని చిరునవ్వు వెన్నెల. అతని పెదవుల్లు కృష్ణలీలామృతపు ఝరులు.

జాజిపందిరికింద కూర్చున్నారిద్దరూ. రతి మోకాళ్ళమీద గడ్డం ఆన్చి అతనిలోకి చూస్తూ అంది 'చెప్పండి.'

'నేనేం చెప్పగలను...దేవత ఏమన్నా చెప్తే వింటాను'

'ఊఁ' అని మూతి తిప్పింది రతి. పెదవులు మన్మథబాణంలా వంగాయి. 'అయినా దేవత దేవుడికేం చెప్పగలదు?' నేలలోకి చూస్తూ అంది రతి.

గడ్డిపరక నిక్కినిక్కి చూసింది.

రాజు రతిచుబుకం పైకెత్తి తనవైపు తిప్పుకున్నాడు. రతి రాజుహృదయంలో తలదాచుకుంది. రాజు బలమైన చేతులు లతలాంటి రతిశరీరాన్ని పెనవైచినై. రతికి దేహావయవాలు పట్టు తప్పినై. దేహంలో అగ్నిపర్వతం బద్దలై లావా వెల్లువై పొల్లింది. జగత్తులోని సౌకుమార్యాలన్నీ రెండుగా విడిపోయి తిరిగి ఒకదానొకటి ఆప్యాయంగా కలిసికొంటునట్లు వారి పరిచుంబన - కోరిక రూపుకట్టి సిద్ధిని పొందుతున్న వారి గాఢపరిష్వంగం చూసి కొమ్మమీది గువ్వలజంట 'చూడు చూడని' ముక్కులతో పొడుచుకున్నాయి. సర్వమూ ఏకమై, ఇది - ఇది అని ఏమీ మిగలక-తమ అస్తిత్వం అణువై, పరమాణువై ఆనందంలో ఐక్యమవుతున్నట్లనిపించింది వారిద్దరికీ.

రతికి ఒళ్ళు తెలిసి, కళ్ళు తెరిచి చూసేసరికి తను రాజుకౌగిలిలో ఉంది. రాజు తనలోకే చూస్తున్నాడు. మత్తుగా తిరిగి కళ్ళు మూసికొని రాజును గాఢంగా కౌగిలించింది. రతికి తనప్రభువు కరుణించినట్లుంది. రాజుకు తనదేవత అనుగ్రహించినట్లైంది. పరస్పర ఆరాధకులైన వాండ్లకు తెలియకుండా చంద్రోదయమైంది.

రతి రాజును ఆరోజు తనతో భోజనం చెయ్యమని బలవంత పెట్టింది. కొసరి కొసరి వడ్డనచేయించింది.

భోజనమైంతర్వాత అకులు మడిచి ఇచ్చింది. రతికి శరీరమంతా గాలిలో తేలిపోతున్నట్లు తేలిగ్గా ఉంది. గబగబ మాటలు దొర్లించి కబుర్లు చెబుతోంది. కిల కిల నవ్వుతోంది. మాటలు చెప్తూ, నవ్వుతూ. మధ్య మధ్య రాజు ముంగురులు సరిదిద్దుతోంది. కొంగుతో అతడి నుదుటి చెమటను అద్దుతోంది. సగంలో ఆపి రాజుముక్కుగిల్లి 'వింటున్నారా!' అంటుంది. రాజు మాట్లాడకుండా తల అటూ ఇటూ తిప్పుతాడు. రతి మువ్వలు కుదిలించినట్లు నవ్వుతుంది.

ఉన్నట్టుండి రాజు 'ఒక్కసారి నృత్యం చేస్తావా?' అనడిగాడు.

'అంతకంటేనా - ఒక నిమిషం' అని పక్కగదిలోకి వెళ్ళింది రతి.

పావుగంట తర్వాత ద్వారం ముందు కిన్నెర సాక్షాత్కరించింది. రాజు చకితుడయ్యాడు. హంసనడకతో రాజువద్దకు వచ్చి పాదాభివందనం చేసింది. 'వద్దు వద్దని' చేతులు పట్టుకోబోయాడు. జారిపోయింది. నాట్యంలో రతి లేడిపిల్లలా చెంగునదూకింది. తటిల్లతలా మెరిసింది. ఎక్కడలేని ఆవేశాన్ని పొందింది. రతి సన్నటినడుము మెలికలు తిరిగిపోయింది. కాలిగజ్జెల రవళి సుళ్ళు తిరిగింది. ఇంతక్రితం నాట్యం చేస్తున్నప్పుడు తను పొందే అలసట నేడేమయిందో! రతి వేసిన ప్రతిపదమూ రాజు హృదయంమీద ముద్రవేసింది. అపురూపములైన హస్తపద విన్యాసాలు చూపింది. తన నాట్యవిశేషం సర్వాన్ని ఆవిష్కరించింది. సర్వమూ సమర్పణ చేసింది. రాజు తన్మయతలో మైమరపు చెందాడు.

ఒకావిడ: మావారండీ, పది నుంచి సహాసం క్రిని ఉంటేగాని భోజనం చేయరు సుమండీ.

గురో కావిడ: కష్టమేనండీ! మరి ఈ రోజుల్లో రోజూ నంతర్పణ లెక్కనంటా యా?!

—రాజులపూడి నరసింహారావు, నర్సాపురం.

'ఏమిటిదంతా' గట్టిగా అరిచాడు అప్పుడే గదిలోకివచ్చిన పద్మనాభరావు. ఆయన వెనకాల గురూజీ. మద్రాసులో పని పూర్తి చేసికొని అప్పుడే బండి దిగారిద్దరూ.

'నాన్నా!'.

నర్తకి

'ఎవరాయన? ఏమిటిదంతా?' అయోమయంలో పడ్డాడు పద్మనాభరావు. సరిగ్గా అదే స్థితిలో మాటరావటంలేదు గురూజీకి.

'చెప్తానుండు నాన్నా' రతి గ్లాసుడు మంచినీళ్లు తాగి చెప్పింది. 'వీరు రాజు. వారిని నేను పెళ్లి చేసికోబోతున్నాను.'

'పెళ్లా! నీకేమైనా మతిపోయిందా?' 'ఏమిటీ మాటలు?' పెద్దగా అరిచాడు పద్మనాభరావు.

'అవును నాన్నా! నేను అన్నీ ఆలోచించుకునే ఈ మాట చెప్తున్నాను.'

'నీకేం దయ్యం పట్టలేదు గదా! భారతదేశ పర్యటనకు మేమంతా సిద్ధంచేసిన స్తే పెళ్లి చేసికొంటాననటమేమిటి?'

'నేను పర్యటనకు రాను నాన్నా. నాకు ఖ్యాతి అక్కర్లేదు'

'ఆ! నా ఆశలన్నీ బుగ్గిచేశావ్! ఇంక నువ్వు ఈ ఇంట్లో ఉండి ఎవర్ని ఉద్ధరిస్తావ్!'

'తక్షణం వెళ్లిపోతాను నాన్నా' అని ఇంట్లోకి వెళ్లి పదినిమిషాల్లో చిన్న సూట్‌కేసులో బట్టలు సర్దుకుని వచ్చి రాజు దగ్గర నిల్చుంది.

గురూజీ గొంతు సవరించుకుని 'చూడమ్మా రతీ! ఆవేశం కూడదు. నిదానంగా ఆలోచించాలి. నీకు దేశంలో, విదేశాల్లో పెద్ద పేరు తీసికొని రావాలని మీ నాన్నా నేనూ అనుకుంటున్నాం. నిన్ను నాట్యానికి అంకితం చెయ్యాలని మీ నాన్న కలలుగంటున్నాడు......'

'నన్ను క్షమించండి గురూజీ. ఈ విషయంలో వాదనగాని, తర్కంగాని ప్రవేశపెట్టకండి. ఇది ఒక్కొక్కళ్ల వ్యక్తిగతమైన తత్వానికి సంబంధించింది. మీరు నిర్ణయించినమార్గం నా ఒంటికి పడదు. సెలవు' అని రతి రాజు చెయ్యిపట్టుకుని గేటుదాటి వెళ్లిపోయింది.

ఆ తర్వాత తరచూ రతి ఉత్తరాలు వ్రాస్తున్నా, పద్మనాభరావు రతి ఇంటికి వెళ్లలేదు. తనఇంటికి రప్పించలేదు. మూడు సంవత్సరాల తర్వాత ఒకనాడు రతి నుండి ఉత్తరం వచ్చింది. తనకు కూతురు కలిగిందనీ, 'మహతి' అని పేరు పెట్టాననీ, మనుమరాలికి తాతగారి ఆశీర్వాదం అవశ్యం కావాలనీ—. ఆ ఉత్తరం చూసి 'మా మహతిని తప్పకుండా నాట్యానికి అంకితం చేయిస్తాను' అని పెట్టె బెడ్డింగు సర్దుకుని ఇంటికి బయల్దేరాడు పద్మనాభరావు. ★

ఒకరు: వాడు మంచివాడు, పదిమందికి పెడ్తేగాని తాను తినలేడు...
మరొకరు: అయితే ఏ హోటల్లో పనండీ?

—రాజులపూడి నరసింహారావు,
నర్సాపురం.

అమృతాంజనము

నొప్పులతో కూడిన వ్యాధులు ముదరకముందే కుదురుతాయి



అమృతాంజనము బాధను నివారించడమే గాక బాధ కారణాన్ని కూడా నిర్మూలిస్తుంది. ఇది రక్త సంచయాన్ని శమింపజేసి రక్త ప్రవాహాన్ని క్రమపరచుటకు ఉపకరించును.
ప్రతిసారి దీనిని అతి కొంచెమే ఉపయోగించవలసి ఉండడంచేత ఒక బుడ్డి నెలలతరబడి వస్తుంది.

అమృతాంజన్ లిమిటెడ్, మద్రాసు-4,
మరియు బొంబాయి-1, కలకత్తా-1, న్యూఢిల్లీ.

ఐటెక్స్ (కాటుక)

అరవింద్ బిందీ
కుంకుమ చాందు

తులిప్ పెర్‌ఫ్యూమ్

న-పాల్
నెయిల్ పాలిష్

అరవింద్ లాబరేటరీస్
P.B. 1415 .... మదరాసు-17.